andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శనివారం ఉష్ణోగ్రత గరిష్టం 31.6 | కనిష్టం 20.5
కామారెడ్డి జిల్లా వార్తలు
5
ఆదివారం 18 ఆగస్టు 2024

కుప్రియల్‌లో డెంగ్యూ కేసు నమోదు

సదాశివనగర్, ఆగస్టు 17: మండలంలోని కుప్రియల్‌లో డెంగ్యూ కేసు నమో దు అయినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన 19 సంవత్సరాల సాయి కృష్ణారెడ్డికి తీవ్ర జ్వరం కాగా కామారెడ్డిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా వైద్యులు డెంగ్యూ కేసు నమోదు అయినట్లు నిర్ధారించారు. గ్రామంలో ఇప్పటికే అనేక మంది జ్వరంతో బాధపడుతు న్నారని శనివారం డెంగ్యూ కేసు నమోదు కావడంతో భయందోళనకు గురవుతున్నామని తెలిపారు.



పంచాయతీ పోరుకు.. సన్నద్ధం!

- ఎన్నికలకు కసరత్తు మొదలుపెట్టిన జిల్లా యంత్రాంగం
- ఓటరు జాబితా తయారీకి సిద్ధమవుతున్న సిబ్బంది
- ఇప్పటికే ఓటరు జాబితా తయారు చేయాలంటూ కలెక్టర్ ఆదేశాలు
- కార్యదర్శులు, ఎంపీడీవోలకు శిక్షణ
- జిల్లాకు చేరిన మార్గదర్శకాల కరపత్రాలు
- ఆరు నెలలుగా జీపీలో కొనసాగుతున్న ప్రత్యేక పాలన
- గ్రామాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి
- జిల్లాలో 526 గ్రామ పంచాయతీలు

కామారెడ్డి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సంకేతాలు ఇవ్వ డంతో పంచాయతీతో పాటు జడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్ని కల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా ఇప్పటికే పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి కొంత మంది సిబ్బంది శిక్షణకు వెళ్లివచ్చారు. మరోవైపు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన శిక్షణ కరపత్రాలు జిల్లా పరిషత్ కార్యాలయాలకు చేరా యి. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఇటీవల జరగడంతో ఓటరు జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాల్లో పెద్దగా మార్పులు ఉండకపోవచ్చని అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 526 గ్రామ పంచాయతీలు ఉండగా వీటి పదవి కాలం గత ఫిబ్రవరిలో ముగియగా ప్రత్యేకాధికారుల పాలన అమలులోకి వచ్చింది. జూలైలో జిల్లా పరిషత్, మండల పరిషత్ పాలకవర్గం పదవికాలం ముగిసింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ సిబ్బంది, కేంద్రాలు, ఓటరు జాబితా, బ్యాలెట్ బాక్సులు, ఇప్పటి వరకు అమలు చేసిన రిజర్వేషన్ వివరాలు తదితర వాటి సేకరణలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటి వరకు వచ్చిన ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రా ల్లో ఎంతమంది ఓటర్లు ఉండాలి. సిబ్బంది ఎందరు ఉండాలి. నామినేషన్‌ల స్వీకరణకు చెల్లించాల్సిన రుసుం తదితర వాటిని ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిసింది. ప్రాదేశిత ఎన్నికలకు సంబంధించిన మార్గదర్శకాలకు రూపొందించిన కరపత్రాలను ప్రభుత్వం జిల్లా పరిషత్‌కు పంపించింది.

ఓటరు జాబితా తయారీకి సిద్ధమవుతున్న సిబ్బంది

త్వరలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో పంచాయతీలు, వార్డుల వారీగా ఓటరు జాబితాను రూపొందించేందుకు చర్యలు మొదల య్యాయి. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఈనెల 8న పంచాయతీ అధికారులతో, సిబ్బందితో సమావేశమై ఓటరు జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికల జాబితా సిద్ధంగా ఉన్నా ప్రస్తుతం వార్డుల వారీ గా, పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాను రూపొంది ంచే పనిలో పడ్డారు. జిల్లాలో మొత్తం 25 మండలాలు ఉండగా 526 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగు తోంది. అయితే జిల్లాకు సంబంధించి ఇటీవల జిల్లాలో కొత్త పంచాయతీలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పాత వాటితో పాటు కొత్త వాటితో పంచాయతీ ఎన్నికల నిర్వహణ జరుగుతుందా లేదా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తాము పంచాయతీ ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు. దీనితో అన్ని గ్రామాలకు ఓటరు జాబితాను రూపొందించే పనిలో పడ్డారు.

కార్యదర్శులు, ఎంపీడీవోలకు శిక్షణ

గ్రామ పంచాయతీ ఓటరుల జాబితా తయారీకి గాను జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా జిల్లాలోని ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొంటున్నారు. పంచాయతీల వారీగా ఎన్నికల నిర్వహణ బ్యాలెట్ పేపర్ల సమకూర్చుకోవడం, బ్యాలెట్ బాక్సులు ఇతర సామగ్రి తదితర ఎన్నికల నిర్వహణపై ఓటరు జాబితా తయారీకి అవసరమైన శిక్షణ నిర్వహిస్తున్నారు.

పల్లెల్లో కుంటుపడుతున్న అభివృద్ధి

పంచాయతీల్లో ప్రత్యేక పాలన కొనసాగుతోంది. జిల్లా లో 25 మండలాల్లో 526 గ్రామ పంచాయతీలు ఉన్నా యి. వీటి పరిధిలో 4,642 వార్డులు ఉన్నాయి. 2019 ఓటరు జాబితా ప్రకారం గ్రామ పంచాయతీల్లో 5,18,201 ఓట్లు ఉన్నాయి. ఇందులో పురుషులవి 2,50,447, మహి ళలవి 2,82,613, ఇతరులవి 4 ఓట్లు ఉన్నాయి. 526 గ్రామ పంచాయతీలే కాకుండా మరో 9 గ్రామ పంచాయ తీల ఏర్పాటుకు గతంలోనే ప్రభుత్వానికి జిల్లా అధికారు లు నివేదించారు. వాటి ఆమోదానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే ఈ ఏడాది జనవరి 31తో సర్పంచ్‌ల పదవికాలం ముగియడంతో 6 నెలలు ప్రత్యేక పాలన విధించారు. ఇప్పటికే ప్రత్యేక పాలన గడువు సైతం ముగియడంతో మరోసారి ప్రభుత్వం పెంచింది. ప్రత్యే కాధికారులుగా మండల స్థాయి అధికారులే ఉండడంతో వారి కార్యాలయంలోని పనుల్లోనే బిజీగా ఉండడంతో పంచాయతీ పాలన అదనపు భారం అవుతుందని పలు వురు అధికారులు వాపోతున్నారు. కొందరికి రెండేసి గ్రామాలు ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాలపై పూర్తిస్థా యి పర్యవేక్షణ చేయలేక పోతున్నారు. పంచాయతీ కార్య దర్శులపైనే భారం పడుతుంది. ఏ పని ఉన్న పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక అధికారుల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. నిధులు కూడా లేకపోవడంతో చిన్నచిన్న పనులు కూడా చేయించలేకపోతున్నామని కార్యదర్శులు వాపోతున్నారు. కొందరు ఆశావహులు చిన్నచిన్న పనులకు సొంతగానే ఖర్చులు చేస్తున్నారు. లైట్లు వేయడం, రోడ్లపై మొరం వేయించి మరమ్మతులు చేయడం వంటి పనులు చేస్తున్నారు.





పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ (ఫైల్)

కామారెడ్డిలో కుండపోత వర్షం



జలకళను సంతరించుకున్న పాల్వంచ వాగు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 17: జిల్లాలో గత రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలకు పలు వాగులు, వంకలు జలకళను సంతరించు కుంటున్నాయి. భారీ వర్షానికి పలుచోట్ల మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. రాజంపేట మండలంలో మొక్కజొన్న పంట వర్షం తాకిడికి నేలకొరిగింది. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 19.4 మి.మీ.ల వర్షపాతం నమోదు కాగా కేవలం కామారెడ్డి పట్టణ కేంద్రంలో 95.4 మి.మిల వర్షం కురిసింది. జిల్లాలో కురుస్తున్న వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి స్వల్పంగా వరదవచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి 564 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.200 టీఎంసీలలో నీరు నిల్వ ఉంది.

జిల్లావ్యాప్తంగా 19.4 మి.మీల వర్షపాతం

జిల్లాలో గడిచిన 24 గంటల్లో 19.4 మి.మీల వర్షపాతం నమోదైంది. అత్యధిక ంగా కామారెడ్డిలో 95.4 మి.మీల వర్షం కురువగా డోంగ్లిలో 0.5 మి.మీ ల అత్యల్ప వర్షపాతం నమోదైంది. భిక్కనూర్‌లో 89.6 మి.మీ, సదాశివనగర్‌లో 57.5 మి.మీ, బీబీపేటలో 37.6 మి.మీ, రామా రెడ్డిలో 30.0మి.మీ, దోమకొండలో 29.3, రాజంపేటలో 26.5, మాచారెడ్డిలో 25.3, పాల్వంచలో 23.5, తాడ్వాయిలో 10.8, పిట్లంలో 5.7, లింగంపేటలో 6.9, గాంధారిలో 6.6, జుక్కల్‌లో 4.4, పెద్దకొడప్‌గల్‌లో 3.0, మ ద్నూర్‌లో 2.8, బిచ్కుందలో 0.6, బీర్కూర్ 0.7, నస్రూల్లాబాద్‌లో 1.1, బాన్సువాడలో 2.1, నిజాం సాగర్‌లో 2.2, నాగిరెడ్డిపేటలో 2.5మి.మీల వర్షపాతం నమోదైంది.



రాజంపేటలో నేలకొరిగిన మొక్కజొన్న పంట

అర్హులకు పోడు పట్టాలు అందించేందుకు కార్యాచరణ చేపట్టాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి కొండా సురేఖ

కామారెడ్డి టౌన్, ఆగస్టు 17: అర్హులకు పోడు పట్టాలు అందించే ందుకు పటిష్ట కార్యాచరణ చేపట్టాలని రాష్ట్ర అటవీశాఖ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండాసురేఖ అన్నారు. శనివారం రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖమంత్రి అనసూయ(సీతక్క)తో కలిసి పోడు భూములపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షి ంచారు. రాష్ట్రంలో అటవీభూముల విస్తీర్ణం, ఆర్‌ఓఎఫ్‌ఆర్ చట్టం, జారీచేసిన పోడుభూముల పట్టాలు, పెండింగ్ ఉన్న దరఖాస్తులు మొదలగు వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉన్నత అధికారులు వివరించారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ చట్టం ప్రకారం 13 డిసెంబ ర్ 2005 నాటికి సాగుచేస్తున్న గిరిజనులు లేదా 13 డిసెంబర్ 2005 నాటికి మూడు తరాల పాటు సాగుచేసిన గిరిజనేతరులకు పోడు భూముల పట్టా పంపిణీ అర్హులని అధికారులు పేర్కోన్నారు. మన రాష్ట్రంలో ఇప్పటివరకు 2,30,735 మంది అర్హులను గుర్తించి వారికి 6,69,676 ఎకరాల అటవీభూమి పట్టాలు పంపిణీచేశామని అధికారు లు తెలిపారు. మన రాష్ట్రంలో ఇప్పటివరకు పంపిణీ చేసిన పోడు పట్టాల వివరాలు, పెండింగ్ ఉన్న దరకాస్తులు, ప్రస్తుతం క్షేత్రస్థాయి లో సాగుజరుగుతున్న అటవీభూముల వివరాలతో కూడిన నివేదిక అటవీశాఖ, గిరిజనశాఖ, రెవెన్యూశాఖ అధికారులు సంయుక్తంగా రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. పోడుభూముల పట్టా కోసం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, అర్హత ఉంటే వారికి పట్టాపంపిణీకి చర్యలు తీసుకోవాలని, సదరు దరఖాస్తును తిరస్కరించే పక్షంలో దానికి గల కారణాలను స్పష్టంగా తెలియజేస్తు నివేదిక అందించాలని అన్నారు.ఆర్‌ఓఎఫ్‌ఆర్ చట్టం ప్రకారం గతం నుంచి సాగుచేసుకుంటున్న అటవీభూములకు మాత్ర మే పట్టాలు అందించాలని, కొత్తగా రాష్ట్రంలో ఇంచ్ అటవీభూమి కూడా సాగుచేయడానికి వీలు లేదని, అటవీభూముల సంరక్షణకు అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పకడ్బంది చర్యలు తీసుకోవా లని, ఎక్కడా నూతన ఆక్రమణలు జరగడానికి వీలులేదని మంత్రి స్పష్టం చేశారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్‌చట్టంపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని,తెలంగాణ రాష్ట్ర గిరిజనులకు, ఆదివాసిలకు మాత్రమే పట్టాలు మంజూరు చేయాలని,వలస వచ్చి నూతనంగా అటవీ ప్రాంతంలో చెట్లు నరికివేత చేయాలని చూస్తే కఠినంగా వ్యవహరిం చాలని మంత్రి పేర్కోన్నారు. గిరిజనులకు అటవీశాఖ వ్యతిరేకం అనే భావన తొలగించే విధంగా పనిచేయాలని అన్నారు.కొత్తగా అడవుల నరికివేత జరగకుండా అటవీ శాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, అటవీభూములు చెట్ల నరికివేత వల్ల కలిగే నష్టాలను విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి తెలిపారు. అటవీభూముల్లో స్మగ్లింగ్ జరగకుండా పక్క నిఘా ఏర్పా టు కావాలని మంత్రి ఆదేశించా రు. పెండింగ్ పోడు భూముల పట్టా దరఖాస్తులను మరోసారి పరిశీ లించాలని సూచించారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ చట్ట ప్రకారం అర్హులందరికి పట్టాలు అందజేయాలని తెలిపారు. అటవీభూముల అనుమతులు కారణంగా గిరిజన, ఆదివాసి ప్రాంతాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రోడ్డుసౌకర్యం, త్రాగునీరు, ఆసుపత్రి వంటి మౌలిక వసతుల కల్ప న పనులకు అటవీఅనుమతులు త్వరగా వచ్చేలా అధికారులు ప్రత్యేక శ్రద్దతో ఫాలో ఆప్ చేయాలని మంత్రి ఆదేశించారు. పట్టాలు మంజూరు చేసిన పోడు భూములలో రైతులుపామ్ ఆయిల్, జీడీ మామిడి తోటలు మొదలగు లాభదాయక పంటలు సాగుచేసేలా రైతులకు అవసరమైన సహకారాలు, సూచనలు అందించాలని మంత్రి తెలిపారు.

చదువు మధ్యలో ఆపేసిన వారికి..
సువర్ణావకాశం!

- పదో తరగతి, ఇంటర్ చదివే వీలు
- ఓపెన్ స్కూల్ విధానంలో అడ్మిషన్లు షురూ
- ఉచిత పాఠ్య పుస్తకాలు సెలవు దినాల్లో తరగతులు

ఎల్లారెడ్డి, ఆగస్టు 17: చదువుకుంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చు. చదువు ప్రాధాన్యం ఒక్క మాటన చెప్పలేం. అయితే వివిధ కారణాలతో చదువు మధ్యలో మానేసిన వారికి ప్రభు త్వం మరో అవకాశం కల్పిస్తోంది. దూర విద్య చదువుకునేందుకు సరైన అవకా శాలు లేకపోవడం అర్ధాంతరంగా నిలిపి వేసిన వారికి ఉద్యోగాల్లో పదోన్న తులకు ఉపయోగపడేలా తెలంగాణ ఓపెన్ స్కూల్స్‌తో ఉన్నత చదువులకు బాటలు వేయవచ్చు. ఓపెన్ స్కూల్ విధానంలో పదవ తరగతి ఇంటర్ ప్రవేశాలకు తాజాగా నోటిఫికేషన్ విడుదల అయింది.

ఉమ్మడి జిల్లాలో 61 అధ్యయన కేంద్రాలు

ప్రభుత్వం ఓపెన్ స్కూల్ విద్యను 2008, 2009లో అందుబా టులోకి తెచ్చింది. ముందుగా పదవ తరగతి చదివేందుకు మాత్రమే అవకాశం ఉండగా ఆ తరువాత మంచి స్పందన రావడంతో 2010-11 దూర విద్యలో ఇంటర్‌ను చేర్చారు. అభ్యాసకులకు మరింత మేలు చేయాలన్న ఉద్దేశంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 61 అధ్యయన కేంద్రాలు ఏర్పా టు చేసి సులభమైన విద్యా విధానంతో పది, ఇంటర్ తరగతులు కొనసాగుతున్నాయి.

రెగ్యులర్ విద్యతో సమానం

దూర విద్యలో 10వ తరగతి ఇంటర్ పూర్తి చేసిన వారికి ప్రభుత్వం రెగ్యులర్ విద్యతో సమానంగా గుర్తింపు ఇచ్చింది. పదవ తరగతి ఇంటర్మీడియట్ కోర్సులు అభ్యాసకులు వృత్తి విద్య కోర్సులు ఆప్షన్‌గా ఎంచుకోవచ్చు. ఇక ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, హెచ్ ఈసీ, ఎంఈసీ కోర్సులు ఉంటా యి. ఇష్టమైన ఏ సబ్జెక్టు లోనైనా కోర్సు పూర్తి చేయ వచ్చు. తెలుగు, ఇంగ్లీష్, హిందూ, ఉర్దూ మీడి యాలలో ఏదైనా ఒక మీ ు డి య ం ల లో చ ద వ చ ్చ ు. విషయాల ఎంపిక వి ష య ం ల లో అభ్యాసకుడికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. అడ్మిషన్ పొందిన తరువాత ఐదు సంవత్సరాల తొమ్మిది పర్యాయాలు పరీక్ష రాసే అవకాశం ఉంటుంది. గురు విద్య పూర్తి చేసిన వారు ఉన్నత విద్య ఉద్యోగాలకు పొందడానికి అర్హులు. మహిళలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు,మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలకు ఫీజు రాయితీ ఉంటుంది.

అర్హులు ఎవరూ అంటే..

దూర విద్యకు 14 ఏళ్లు నిండిన వారందరూ అర్హులే. 15 సంవత్సరాలు నిండి పదవ తరగతి పూర్తయిన వారందరూ ఇంటర్ కోర్సు చదువుకునే అవకాశం ఉంటుంది. ఇంటర్ మానేసిన వారికి ఫెయిల్ అయిన వారికి ఇంటర్మీడియట్ చదువుకునే వీలుంటుంది. సెలవు దినాల్లో మాత్రమే తరగతులు ఉంటాయి. ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందజేస్తారు. మహిళలు పలు వృత్తి వ్యాపార రంగాల్లో ఉన్న వారికి ఉద్యోగులకు ప్రజాప్రతినిధులకు వివిధ సంఘ సభ్యులకు సామాజిక ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి ఇదోక సదవకాశం చెప్పు కోవచ్చు.

అడ్మిషన్ ఇలా...

ఓపెన్ స్కూల్ విధానంలో పది ఇంటర్ కోర్సుల్లో చేరేందుకు అడ్మిషన్లను ప్రారంభించింది. వచ్చే నెల సెప్టెంబరు 10వ తేది వరకు ప్రవేశ గడువు ఉంది. పదవ తరగతి ఓసీ కేటాగిరిలో పురుషులకు అడ్మిషన్ ఫీజు 1400 చెల్లించాలి. మిగతా వారు ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనారిటీ పురుషులు మహిళలందరికీ రూ. వెయ్యి చెల్లించాలి. ప్రాస్పెక్టస్ ఫీజు రూ.150 అదనం, ఇంటర్‌లో ఓసీ కేటాగిరికి చెందిన వారైతే 1500లు, మిగతా వారు రూ. 1200, ప్రాస్పెక్టస్ ఫీజు రూ.300, ఆన్‌లైన్ ప్రవేశాలు పొందవచ్చు. తెలంగాణ ఓపెన్ స్కూల్ ఓఆర్‌జీ వెబ్‌సైట్ ద్వారా అడ్మిషన్ పొందాలి. అడ్మిషన్ ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లించి రషీదు అడ్మిసన్ ఫారం ప్రింట్‌తో పాటు కలిపి అధ్యాయ కేంద్రంలో సమర్పిస్తే సమాచారం మెసెస్ రూపంలో సెల్‌ఫోన్‌కు అందుతుంది.

ఓపెన్ విద్య అందరికీ వరం

చదువు మధ్యలో మానేసిన వారికి దూర విద్య వరం లాంటిదని ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ తుల రవీందర్ తెలిపారు. విద్య అర్హతలు పెంపొందించడానికి ఉపాధి అవకాశాలకు దూర విద్య దోహదపడుతుందని అన్నారు. గత ఏడాది పదవ తరగతిలో 58 శాతం, ఇంటర్‌లో 54 శాతం మంది ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. ఓపెన్ విద్యకు సంబంధించిన సమాచారం కోసం ఫోన్ నెంబర్ 8008403518, 9849234696 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

కోటగిరిలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

కోటగిరి, ఆగస్టు 17: కోటగిరి మండల కేంద్రంలోని పెద్ద హనుమాన్ మందిరం సమీపంలో పైడి ఎల్లారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను శనివారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామ ప్రజలకు శుద్ధమైన జలాన్ని అందించేందుకు తనవంతు సాయంగా వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకులు ఎల్లారెడ్డి, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

తొర్లికొండలో ఘనంగా వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, ఆగస్టు17: మండలంలోని తొర్లికొండలో వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచే భక్తులు కొండపై చేరుకొని అనంతరం స్వామివారి పల్లకిని కొండపై చుట్టు ప్రదక్షిణ చేయించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ సాయిరెడ్డి, వీడీసీసభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉప్లూర్ పోచమ్మ ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కమ్మర్‌పల్లి, ఆగస్టు 17: మండంలోని ఉప్లూర్ గ్రామంలో పోచమ్మ ఆలయ నిర్మాణ నిమిత్తం సరసం గంగారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తమవంతుగా రూ.లక్ష విరాళాన్ని వీడీసీ సభ్యులకు డాక్టర్ సరసం రాజేశ్వర్‌రెడ్డి, న్యాయవాది సరసం చిన్నారెడ్డి శనివారం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు సోమ దశరత్, పాలకవర్గ సభ్యులు కొమ్ముల రవీందర్, వన్నేల రాజేశ్వర్, బద్దం ధన్‌రెడ్డి, బద్దంనగేష్‌రెడ్డి, బద్దం మోహన్‌రెడ్డి, చింతకుంట శ్రీనివాస్, మల్లయ్య పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

బోధన్‌రూరల్,ఆగస్టు17: కోల్‌కత్తా ఆర్‌జీఆర్ వైద్య కళాశాలలో పీజీ వైద్య విద్యార్థినిపై హత్యాచారం జరిగిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని బోధన్‌లో డాక్టర్ల ఆధ్వర్యంలో బోధన్ ఆసుపత్రి ఎదుట వైద్యులు,వైద్య సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటి హేయమైన ఘటనలను భవిష్యత్‌లో నిరోధించేందుకు కేంద్రం రక్షణ చట్టం అమలు చేయాలన్నారు. లేదంటే ఇలాంటివి తరుచు పునరావృతం అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఎర్రకోటపై జెండా ఎగురవేసిన రోజే వైద్యులపై గుండాల గుంపు దాడి చేసిందని పేర్కొన్నారు. ఈ కేసును సీబీఐకి అప్పగించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బోధన్ ఆసుపత్రిలో పోలీస్ ఓట్‌పోస్ట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులున్నారు. ప్రైవేటు మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో పట్టణంలోని ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌లు మూసి వేసి మృతి చెందిన వైద్యురాలికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పీపీఎంపీ అసోసియేషన్ నాయకులు యాదా చారి, కారం స్వామి,హన్మాండ్లు, రియాజ్, శ్రీనివాస్, బాలరాజు, శివన్నారాయణ, రఘు, తదితరులు పాల్గొన్నారు.

● పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 17: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య నింధితులను వెంటనే ఉరి తీయాలని కోరుతూ ఏబీవీపి ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని కంఠేశ్వర్ వద్ద ర్యాలీ నిర్వహించి పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఇందూర్ విభాగ్ కన్వీనర్ శశిధర్ మాట్లాడుతూ బెంగాల్ రాష్ట్రంలో జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేయడం బాధాకరమని ఆ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. నింధితులను వెంటనే ఉరి తీయాలని ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ సీఎం పదవికి మమత బెనర్జి రాజీనామా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ సునీల్, దాస్, అలంకార్, మహేష్, నితిన్, తదితరులు పాల్గొన్నారు.


బోధన్ ఆసుపత్రిలో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

● కోటగిరిలో నల్లబ్యాడ్జీలు ధరించి డాక్టర్‌ల నిరసన

కోటగిరి: ఇటీవల కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారానికి నిరసనగా శనివారం కోటగిరి పీహెచ్‌సీ ఎదుట వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని, వైద్యసిబ్బందికి రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుప్రియ, ఏఎన్‌ఎం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోస్రా: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24గంటలు ఓపీ సేవలు బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్య అధికారి విజయ్ కుమార్ మాట్లాడుతూ శనివారం నిజామాబాద్ జిల్లా వైద్య అధికారుల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రైవేట్ హాస్పిటల్‌లో ఓపీ సేవలు బంద్ నిర్వహించడం జరిగిందన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఒక యువ పీజీ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేసినందుకు నిరసనగా ఐఎంఏ డాక్టర్ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ధర్పల్లి: కోలకత్తాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య కు నిరసనగా మండల కేంద్రంలోగల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. బాధితురాలి కు టుంబానికి న్యాయం జరగాలని వైద్యులకు ప్రభుత్వాలు అన్ని రకాల రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. దోషులను ప ట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి సుశాంత్, మౌనిక, నర్సింగ్ ఆఫీసర్ శాంత మ్మ, రమేష్, మమత, వసంత, జయ, లక్ష్మి, జయలక్ష్మి, వాజిద్, సంతోష్, నరేందర్, మల్లేష్, లత, రేఖ తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:కోల్‌కత్తా హత్యచార ఘటన నిరసిస్తు 24గంటలు ఐ ఎంఏ ఆందోళనకు పిలుపునివ్వగా శనివారం డిచ్‌పల్లి మూహ్నై పడ కల ఆస్పత్రి ఎదుట ఆస్పత్రి సిబ్బంది నల్లబ్యాడ్జీలతో ఓపీ సేవలు నిలిపివేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డా.సందీప్ మాట్లా డుతూ.. వైద్య సిబ్బందిపై దాడులను కట్టడి చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని, వైద్యుల పనిగంటలు పరిస్థి తుల నేపథ్యంలో దాడులు జరగడం అమానుషనమన్నారు.

పోడు భూముల పంపిణీపై సమగ్ర వివరాలు అందించండి

● రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ● మంత్రి సీతక్కతో కలిసి ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 17:పోడు భూముల పంపిణీకి సంబంధించి సమగ్ర వివరాలను అందించాలని రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లకు సూచించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్కతో కలిసి శనివారం మంత్రి కొండా సురేఖ ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆయా జిల్లాల్లో ఇప్పటి వరకు పోడు పట్టాల కోసం వచ్చిన క్లెయిమ్‌లు ఎన్ని, వాటిలో ఎంత మందికి ఎన్ని ఎకరాల భూములకు పట్టాలు పంపిణీ చేశారు, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి అందుకు గల కారణాలు ఏమిటి, పట్టాలు పొందిన వారికి భూమి హద్దులు చూపించారా, తదితర వివరాలను ఒక్కో జిల్లా వారిగా మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు రెండు విడతలుగా రాష్ట్రంలో పోడుపట్టాల పంపిణీ జరిగినప్పటికీ ఇంకా పలుచోట్ల గిరిజనుల నుంచి వినతులు వస్తున్నాయని అన్నారు. నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన కుటుంబాలకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందని దీన్ని దృష్టిలో పెట్టుకొని పోడుభూముల పట్టాల పంపిణీకి సంబంధిత పూర్తి వివరాలను గడువులోగా పంపించాలన్నారు. వీటిపై ముఖ్యమంత్రితో చర్చించి తగు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని పోడు భూములకు సంబంధించి భవిష్యత్తులో మళ్లీ ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎక్కడ కూడా అటవీభూముల ఆక్రమణ, చెట్ల నరికివేత జరుగకుండా పర్యవేక్షణ చేయాలని, అడవుల నరికివేత వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలందరిలో అవగాహన పెంచేందుకు విస్తృతస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సిరికొండ మండలం రావుట్లలో అటవీభూమిని కొంత మంది యదేచ్ఛగా చెట్లు నరికివేసి కబ్జాలకు పాల్పడుతున్నారని వీసీలో పాల్గొన్న సందర్భంగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మంత్రికి ఫిర్యాదు చేశారు. తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు స్పందిస్తూ వెంటనే అదనపు కలెక్టర్‌ను పంపించి క్షేత్రస్థాయి పరిశీలన జరిపిస్తామని సమగ్ర వివరాలతో నివేదిక పంపిస్తామన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని ఏడు మండలాలల్లో పోడు భూముల సమస్య ఉందని అర్హులైన వారికి న్యాయం చేయాలని కోరారు.


వీసీలో పాల్గొన్న కలెక్టర్, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

సిరికొండ ఆగస్టు 17 : పంట రుణాలు తీసుకున్న రైతులందరికి ఆంక్షలు లేకుండా రుణ మాఫీని వర్తింప చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. సిరికొండలో జరిగిన కార్యకర్తల సమావేశంలో రమేష్ మాట్లాడుతూ మూడు దపాలు అమలు చేసిన రుణ మాఫీ జరిగినప్పటికి చాలా మంది రైతులకు మాఫీ కాలేదని అన్నారు. రుణ మాఫీ కాని రైతులు ప్రతి రోజు బ్యాంకులు, సహకార సంఘాలు, వ్యవసాయ కార్యలయాల చుట్టు తిరుగుతున్న వారికి సరియైన సమాచారం దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు.

నవీపేట: అర్హులైన రైతులందరికీ రుణమాఫీని వర్తింపజేయాలి బీజేపీ మడల అధ్యక్షులు సరిన్ కోరారు. శనివారం మండలంలోని జన్నేపల్లి కెనరా బ్యాంకు మేనేజర్ మధును పలువురు రైతులతో కలిసి మాట్లాడారు. జన్నేపల్లి కెనరా బ్యాంకులో అర్హులైన చాలా మంది రైతులకు రుణ మాఫీ వర్తించకపోవడం శోచనీయమని అన్నారు. వెంటనే సంబంధిత రైతులందరికీ రుణమాఫీ వర్తించే విధంగా చూడాలని లేనట్లయితే బ్యాంకు ఎదుట ఆందోళన చేపడతామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆదినాథ్, ప్రదీప్, గంగాధర్; సాయిలు, తదితరులున్నారు.

ఆర్మూర్‌రూరల్ : ఆలూర్ మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు (సిండికేట్ బ్యాంక్) ఎదుట శనివారం రైతులు బైటాయించి ధర్నా నిర్వహించారు. బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్లనే రైతులకు రుణమాఫీ జాబితాలో తమ పేర్లు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకు అధికారుల తప్పిదానికి తమను బలి చేయడం ఎంత వరకు సమంజసమని రైతులు నిలదీశారు. కెనరా బ్యాంకు పరిధిలో ఆలూర్, దేగాం, మచ్చర్ల, కల్లెడి, గుత్ప గ్రామాలకు చెందిన రైతులకు ఖాతాలు ఉన్నాయి. సుమారు 2500మంది రైతులకు ఖాతాలు ఉండగా, వారు వ్యవసాయ రుణాలు తీసుకున్న ఇందులో కేవలం 500మంది రైతులకే రుణమాఫీ రాగా మిగత రైతులకు జాబితాలో పేర్లు లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. రుణాలు పొందిన ఖాతాదారుల డేటాను బ్యాంకు అధికారులు సరిగ్గా పంపకపోవడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. గత ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం రైతులందరికి రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డి ధర్నా చేస్తున్న రైతులతో మాట్లాడారు. అందరికి రుణమాఫీ చేస్తానని ఇందుకు ప్రభుత్వం రూ.30వేల కోట్లు కేటాయించిందని అన్నారు. అనంతరం బ్యాంకు అధికారులతో మాట్లాడారు. ఇలా ఉండగా తాము ఖాతదారుల డేటాను సక్రమంగానే పంపామని, తమ వద్ద ఏలాంటి లోపం తలెత్తలేదని రైతులకు వివరించారు. రుణమాఫీ రాకపోవడంలో తమ బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యంలేదని, ప్రభుత్వమే చేయాల్సి ఉందన్నారు. రుణమాఫీ కానీ రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని వివిధ గ్రామాల రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్మూర్ సీఐ రవికుమార్ రైతులతో మాట్లాడి ధర్నా విరమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి : ప్రభుత్వం మూడు విడతల్లో చేపట్టిన రుణమాఫీపై రైతులు నిరసనలు వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో రైతులు మాట్లాడుతూ మండలంలో సగానికి పైగా రైతులకు రుణమాఫీ వర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు 15న రెండు లక్షలలోపు రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ ప్రకటించిన ప్రభుత్వం అందులో అర్హులైన రైతుల పేర్లు లేవని వారు విమర్శించారు.

జిల్లాలో 15 మంది ఏవోల బదిలీలు

కామారెడ్డిటౌన్, ఆగస్టు 17 : జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలోని 15 మంది వ్యవసాయశాఖ అధికారులను బదిలీచేస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేసింది. నాగిరెడ్డిపేట ఏవోగా ఉన్న జి.విజయశంకర్ నిజామాబాద్‌కు బదిలీఅయ్యారు.ఎల్లారెడ్డి ఏవో ఎస్.హరిష్‌కుమార్ నిజామాబాద్ జిల్లాలోని మోర్తాడ్‌కు బదిలీ అయ్యారు.కామారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏవోగా ఉన్న నర్సింలు తాడ్వాయి ఏవోగా బదిలీకాగా బాన్సువాడ ఏవోగా ఉన్న జి.నరేందర్‌ను బీబీపేటకు బదిలీ చేశారు. కామారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏవోగా ఉన్న టి.రమ్యశ్రీని నిజామాబాద్‌కు బదిలీచేశారు. కామారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తున్న సుమితరాణిని రాజంపేట ఏవోగా,మాచారెడ్డి ఏవో ఎస్.బాల్‌రెడ్డిని మెదక్ జిల్లా హవేళిఘనపూర్ ఏవోగా, బోపాస్‌పల్లి వ్యవసాయకేంద్రం ఏవోగా ఉన్న సుధాకర్‌ను వరంగల్‌కు బదిలీచేశారు .కామారెడ్డి ఏవోగా శ్రీనివాస్‌రావును పాల్వంచ ఏవోగా,పిట్లం ఏవో కృష్ణను పెద్దకొడప్‌గల్ ఏవోగా,జుక్కల్ ఏవో నవీన్‌కుమార్ నిజామాబాద్ జిల్లాలోని నవీపేట ఏవోగా,తాడ్వాయి ఏవో బీ.శ్రీకాంత్‌ను నిజామాబాద్‌లోని ఇందల్‌వాయి ఏవోగా, దోమకొండ ఏవో పవన్‌కుమార్‌ను కామారెడ్డి ఏవోగా,ఎల్లారెడ్డి ఏవో సంతోష్‌కుమార్‌ను జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం ఏవోగా బదిలీచేశారు. బీర్కూర్ ఏవో కమలను పిట్లం ఏవోగా బదిలీచేశారు.

'రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ పనిచేస్తోంది'

ఖిల్లా, ఆగస్టు17 :రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, రైతుల సమస్యల పరిష్కారానికి ప్రతి సొసైటీ కేంద్రాల్లో రైతు సేవా కౌంటర్లను ఏర్పాటు చేస్తుందని, ఒకే సారి రైతులకు రూ2లక్షల రుణమాఫి చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఇందూరు జిల్లా కేంద్ర సహకార సొసైటీ(డిసిఎంటీ చైర్మన్ తారచంద్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలోని తన చాంబర్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడగానే రైతులకు ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫి చేస్తామని చెప్పిన ప్రకారం రైతులకు మూడు విడతల్లో రైతు రుణమాఫి చేయడం జరిగిందన్నారు. రుణమాఫీ రాని వారి కోసం ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ నిలచిపోయిందన్నారు. అటువంటి రైతులు తిరిగి ధరఖాస్తు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమని పేర్కొన్నారు.సన్న, చిన్నకారు వ్యాపారులకు ఆర్థిక సహాయం అందించడానికి కృషి చేస్తుందన్నారు. రైతుల కోసం రైతుభరోసాతో పాటు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేయనున్నామన్నారు. సమావేశంలో సొసైటీ చైర్మన్లు నాగేశ్వర్‌రావ్, శేఖర్‌రెడ్డి, రామకృష్ణ, శ్రీధర్, రాంచందర్‌గౌడ్‌లు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ చోరీ

మోస్రా,ఆగస్టు17: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులోని పంట పొలాల్లో శనివారం ఉదయం రైతులు పొలాలకు వెళ్లగా మూడు ట్రాన్స్‌పార్మర్‌ను ధ్వంసం చేసి ఉన్నాయని స్థానిక ఏఈకి తెలియపర్చగా ఆయన పరిశీలించారు. మూడు చోట్ల మూడు ట్రాన్స్‌పార్మర్‌లను ధ్వంసం చేసి అందులోని ఆయిల్, కాపర్‌ను దొంగిలించారని ఏఈ మిథున్ తెలిపారు. జరిగిన ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఆయన అన్నారు.

ఇసుక తరలించిన ఒకరిపై కేసు

కోటగిరిఆగస్టు17: పొతంగల్ మంజీర నది సమీపంలో ఇసుక డంప్‌ను తహసీల్దార్ మల్లయ్య నాలుగు రోజుల క్రితం సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుకను పొతంగల్ గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి అక్రమంగా తరలించుకుపోయారని తహసీల్దార్ తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి టీఎస్16ఈహెచ్4696 అనే నెంబర్ గల జేసీబీని స్వాధీనం చేసుకోవడంతో పాటు యాజమాని రాజుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు జేసీబీని స్వాధీనం చేసుకోవడంతో పాటు యాజమానిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ సందీప్ తెలిపారు.

ఉరేసుకొని మహిళ మృతి

ధర్పల్లి, ఆగస్టు 17: మండలంలోని ఒన్నాజిపేట్ గ్రామానికి చెందిన మిద్దెల లక్ష్మి (59) ఉరివేసుకొని మృతి చెందినట్లు ఎస్సై రామకృష్ణ శనివారం తెలిపారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో దూలానికి ఉరివేసుకొని చనిపోయినట్లు ఆయన చెప్పారు. లక్ష్మి ఒంటరితనంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. మృతురాలి కొడుకు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రతీ ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలి

● మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

కోటగిరి,ఆగస్టు17: సమాజంలో ప్రతి ఒక్కరు దైవభక్తిని అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని చావిడి గల్లీ పెద్ద హనుమాన్ మందిరంలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం కన్నుల పండువగా సాగింది. ఈ కార్యక్రమానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌తో పాటు రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, బీజేపీ నాయకులు యెండల లక్ష్మి నారాయణలు ముఖ్య అతిథిగా హజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ధ్వజస్తంభ ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించారు. ఆలయంలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ స్పీకర్ పోచారం మాట్లాడుతూ నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకులంలో నేడు స్పాట్ అడ్మిషన్

పెర్కిట్, ఆగస్టు17: ఆర్మూర్ పట్టణంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల (భీమన్‌పల్లి) నందు మిగిలిన సీట్లకు గాను ఆదివారం స్పాట్ అడ్మిషన్‌లు ప్రాంతీయ సమన్వయ అధికారి ఎన్.గంగారాం, ప్రిన్సిపాల్ సోమ్లా తెలిపారు.

దోషులను శిక్షించాలని వైద్యుల నిరసన

కామారెడ్డిటౌన్, ఆగస్టు 17 : కలకత్తా ఆర్‌జేకర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పీజీ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యను ఖండిస్తున్నామని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం, గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి వైద్యసిబ్బంది అన్నారు. వైద్య విద్యార్థిపై పాశవికంగా అత్యాచారం చేయడంతో పాటు హత్యచేసిన దోషులను వెంటనే శిక్షించాలని అన్నారు. వైద్యులపై జరుగుతున్న ఈ దాడులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నివారించాల్సిన అవసరం ఎంతైన ఉందని అన్నారు. వైద్యుల రక్షణ కోసంప్రత్యేక చట్టాన్ని తీసుకు రావాలని అన్నారు. అదేవిధంగా కలెక్టరేట్ వద్ద కూడా ఐఎంఏ వైద్యులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో జీజీహెచ్ వైద్య బృందం రాంసింగ్, బన్సిలాల్, రేఖ, వెంకట్, శరత్, శ్రీని వాస్, సంతోష్, నర్సింగ్‌స్టాఫ్ పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న ప్రభుత్వ వైద్యులు

రామారెడ్డి : కలకత్తాలో పీజీ చదువుతున్న వైద్యురాలిపై అత్యాచారం, హత్యచేసిన నిందితులను శిక్షించాలని రామారెడ్డి పీహెచ్‌సీ వైద్యులు శనివారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో వైద్యుడు సురేష్, సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు, ఫార్మాసిస్టు పాల్గొన్నారు.

మద్నూర్ : పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారానికి నిరసనగా ఉమ్మడి మద్నూర్ మండలంలో డోంగ్లి మండల కేంద్రంలో పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు వైద్యసిబ్బంది ఆందోళన చేపట్టారు. ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తూనే నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కత్తాలోని అర్తికర్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారానికి నిరసన చేపట్టినట్లు వైద్యురాలు శ్రీలేఖ వెల్లడించారు. గ్రామస్తులు నిరసన సంఘీభావం తెలిపారు.

బాన్సువాడటౌన్ : కలకత్తాలోని గవర్నమెంట్ వైద్యకళాశాలలో డ్యూటీలో ఉన్న మహిళా డాక్టర్‌పై జరిగిన దారుణ సంఘటనకు నిరసనగా శనివారం బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రాణాలను కాపాడే డాక్టర్లపై ఇలాంటి దాడులు జరపడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి శంకర్‌గౌడ్, పట్టణ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, నాయకులు కోనాల గంగారెడ్డి, చిరంజీవి, విశాల్, అశ్విన్, సిద్ధార్థ, సుధాకర్‌గౌడ్, దత్తు తదితరులున్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్ర మోహన్ ఆధ్వర్యంలో మద్దతుగా వైద్య సిబ్బంది శనివారం గంట ఓపీ వైద్య సేవలు నిలిపివేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్లు వైద్య సేవలు నిలిపి మద్దతు ప్రకటించారు.

దోమకొండ : మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో ఆదివారం వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమ్మెబాట



అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

కామారెడ్డిటౌన్,ఆగస్టు 17 : రాజీవ్ ఆరోగ్యశ్రీ మిత్ర సమ్మెలో పిలుపులో భాగంగా శనివారం కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీయంహెచ్‌వో చంద్రశేఖర్‌కు తమ సమస్యలు తీర్చాలని ఆరోగ్యమిత్రలు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా17 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నటువంటి ఆరోగ్య మిత్రులను డీపీఓ క్యాడర్‌ను తక్షణమే కల్పించి ఉద్యోగభద్రత కల్పించాలని రాజీవ్‌ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అల్లావుద్దీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేతనసవరణ చట్టం 60 జీవో ప్రకారం కనీసం 22750 జీతం ఇవ్వాలని తెలిపారు.గత వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2007లో రాజీవ్‌ఆరోగ్యశ్రీ పథకానికి జీవం పోశారు. అప్పటినుండి రాజీవ్‌ఆరోగ్యశ్రీ పథకానికి క్షేత్రస్థాయిలో ఆరోగ్య మిత్రలను నియమించడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యపథకానికి మూలస్తంభాల అయినటువంటి ఆరోగ్య మిత్రులను గత ప్రభుత్వాలు నుంచి మొదలుకొని ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్యమిత్రుల మొక్క డీపీఓ క్యాడర్‌తో పాటు జీతాల పెంపుదల, ఉద్యోగభద్రత గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా దారుణమని తెలిపారు.తమ సమస్యలను వెంటనే పరిష్కారించాలని లేదంటే ఈనెల 20 నుంచి సమ్మెకు సిద్ధమవుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్యమిత్రలు గంగాధర్,అనిల్, నిర్మల, నర్సవ్వ, మహేష్,కృష్ణవర్ధన్, శివాజీ, సంతోష్, సాయిబాబా, జననిరాణి, కాశమని,సురేఖ, క్రాంతికిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుమందుల నియంత్రణపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న యాంటీ నార్కోటిక్ డీఎస్పీ

కామారెడ్డి టౌన్, ఆగస్టు 17: కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీకళాశాలలో యాంటినార్కోటిక్ డీఎస్పీ సోమనాథం ఆధ్వర్యంలో శనివారం మత్తుమందుల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మత్తుమందుల వల్ల కలిగే నష్టంపై వివరించారు. కార్యక్రమంలో సీఐ రామన్, ఎస్ఐరాజు, వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ అందుకున్న హనీఫ్‌పాషా

కామారెడ్డిటౌన్, ఆగస్టు 17: కామారెడ్డికి చెందిన హనీఫ్‌పాషా విశ్వవిద్యాలయంలోని జంతుశాస్త్ర విభాగంలో డాక్టరేట్ పట్టా సాధించాడు. ఎనలైటికల్ స్టడీ ఆన్ డెవలప్‌మెంట్ ఆఫ్‌షిప్ బయో డైవర్సిటీ అండ్ హబిటేట్ ఎకలజీ అనేఅంశంపై డాక్టర్ దీపిక వాట్స్ పర్యవేక్షణలో పరిశోధనలు చేసి అందించడంతో పీహెచ్‌డీ అందిం చినట్లు తెలిపారు. ప్రస్తుతం హనీఫ్‌పాషా భిక్కనూర్ మండలంలోని అహ్మద్ బీఎడ్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు

బీజేపీ కామారెడ్డి పట్టణ కార్యవర్గం ఏర్పాటు

కామారెడ్డిటౌన్, ఆగస్టు 17 : బీజేపీ కామారెడ్డి పట్టణ కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షురాలు అరుణతార, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఏర్పాటు చేసినట్లు పట్టణ అధ్యక్షుడు ఆకులభరత్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా రజినీకాంత్, గంగాధర్‌రావు, నబ్బని ప్రవీణ్, విజయ్‌పాల్‌రెడ్డి, రఘుపతి, మందమనోజ్, ప్రధానకార్యదర్శులుగా ప్రతాప్‌నేత, ముదాం శ్రీకాంత్, సెక్రటరీలుగా నరేష్‌గౌడ్, ముల్క శ్రీనివాస్, గంగారాం, హేమలత, నరహరి, రంజిత్, కోశాధికారిగా గురుమూర్తి, యువమోర్చా రాజేష్‌కుమార్, మహిళ మోర్చా బాలమణి, కిసాన్‌మోర్చా గడ్డమీది రాజు, దళితమోర్చా భూంపల్లి భూపాల్, మైనార్టీమోర్చా అబ్దుల్‌లతీఫ్, ఓబీసీ మోర్చా ఉప్పులక్ష్మీపతి, కార్యవర్గ సభ్యులుగా నరేష్, సత్యం, శ్రీనివాస్, రవీందర్, ధనలక్ష్మీ, నవీన్, నవీన్ యాదవ్, గిరిబాబు, సాయి,శశికుమార్, సతీష్‌చారి, రాకేష్, అశోక్, ప్రవీణ్, కృష్ణప్రసాద్, రాజ్‌పుత్, కిషన్, సత్యంలతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.

పంటల పరిశీలన

రాజంపేట, ఆగస్టు 17 : రాజంపేట మండలంలోని పెద్దయిపల్లి గ్రామంలో శుక్రవారం కురిసిన భారీవర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటను వ్యవసాయ విస్తరణాధికారి శ్రీకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ గాలి వేగంతో కురిసిన వర్షానికి మొక్కజొన్న వేర్లు బయటకు వచ్చి పంట పడిపోవడం జరిగిందని రైతులకు తెలిపారు. పంటలో నీరు ఎక్కువగా ఉన్న చోట మురుగు కాలువలు ఏర్పాటు చేసుకుని పంటలు నీటి ప్రవాహం నుంచి కాపాడుకోవాలని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో రైతులు బోయినీ నర్సింలు, నవీన్‌కుమార్, ప్రశాంత్‌కుమార్, డీలర్‌గోపాల్ ఉన్నారు.

బాన్సువాడ సీఐని కలిసిన ఆటోవర్కర్లు

బాన్సువాడటౌన్ , ఆగష్టు 17 : బాన్సువాడ పట్టణ సీఐ కృష్ణను శనివారం ఆటోవర్కర్లు కలిసి తమ సమస్యను పరిష్కరించాలంటూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్ మాట్లాడుతూ ఆటోవర్కర్లకు పార్కింగ్ స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బస్టాండ్ ప్రాంతంలో పార్కింగ్ స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సీఐని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆటోవర్కర్లు తదితరులున్నారు.

ఎమ్మెల్యే పోచారంను కలిసిన ఇస్కాన్ ప్రతినిధులు

బాన్సువాడటౌన్ , ఆగష్టు 17 : ఇస్కాన్‌సభ్యులు శనివారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీ సరస్వతి ఫంక్షన్‌హాలులో నిర్వహించబోయే కార్యక్రమాలకు ఎమ్మెల్యేను ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. అదేవిధంగా అన్ని పాఠశాలలకు వెళ్లి జన్మాష్టమి సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధి వెంకట్‌దాస్ ప్రభు, అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు ముదిరెడ్డి విఠల్‌రెడ్డి, మల్లికార్జున్, లక్ష్మణ్, సాయిలు తదితరులున్నారు.

పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలు

బాన్సువాడటౌన్ , ఆగష్టు 17 : రాఖీపౌర్ణమి పురస్కరించుకుని శనివారం పట్టణంలోని ప్రభుత్వ , ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. రిపుల్స్ పాఠశాలలో విద్యార్థులు నీవు నాకు రక్ష , నేను నీకు రక్ష , మనిద్దరం దేశానికి రక్ష అంటూ ఒకరికొకరు రాఖీ కట్టుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు మిఠాయిలను పంచి పెట్టారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తక్కెడపల్లి నర్సింగ్‌రావు , సిబ్బంది శ్యామల, రవి , రంజిత్ , కిశోర్ , సంజయ్ , ఉపాధ్యాయులు తదితరులున్నారు.

'కర్షక రుణమిత్ర పథకం కింద రుణాలు'

మద్నూర్, ఆగస్టు 17 : రైతులకు కర్షక రుణమిత్ర పథకం కింద రెండు లక్షల వరకు రుణం ఇవ్వడానికి గాను నాబార్డు నుంచి ఆదేశాలు వచ్చాయని మద్నూర్ కో-ఆపరేటీవ్ బ్యాంకు మేనేజర్ సాయిలు తెలిపారు. రైతులకు బంగారం, భూములు, పంటలపై రుణాలను తక్కువ వడ్డీకే కో-ఆపరేటీవ్ బ్యాంకులో ఇస్తున్నామని, ఈ బ్యాంకు రైతుల కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో రైతులకు కర్షక రుణ పథకం కింద రూ.లక్షా 50 వేలు మాత్రమే ఇచ్చేవారని, దానిని నాబార్డు వాళ్ళు రెండు లక్షల వరకు పొడిగించడం జరిగిందని తెలిపారు. అర్హులైన రైతులు తమ బ్యాంకులో వచ్చి రుణాలు పొందవచ్చని తెలిపారు.

భూంపల్లిలో వైద్యశిబిరం

ఆంధ్రజ్యోతికి స్పందన



భూంపల్లిలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

సదాశివనగర్, ఆగస్టు 17 : మండలంలోని భూంపల్లిలో శనివారం వైద్యఆరోగ్యశాఖ అధికారులు వైద్యశిబిరం నిర్వహించారు. ప్రత్యేకాధికారుల పాలనలో పారిశుద్ధ్యం కరువు, విష జ్వరాలతో భూంపల్లి ప్రజల ఇబ్బందులపై శనివారం వచ్చిన కథనానికి అధికారులు కదిలారు. గత 15 రోజుల నుంచి గ్రామంలో విషజ్వరాలు ప్రబలడంతో అధికారులు చర్యలు చేపట్టారు. వీధులలో స్వచ్ఛత కార్యక్రమాలు గడ్డిమందు పిచికారి, దోమలమందు పిచికారి చేయించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిని ఆస్మా వైద్యబృందంతో శిబిరం ఏర్పాటుచేసి ఇంటింటి సర్వే నిర్వహించి అవసరమున్నవారికి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు.

డబుల్‌బెడ్‌రూమ్ ఇవ్వాలని నిరసన



డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ప్రవేశించిన గ్రామస్తులు

నసురుల్లాబాద్, ఆగస్టు 17 : గత ఆరు సంవత్సరాల క్రితం నిర్మాణం పనులు ప్రారంభించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మాకేందుకు ఇవ్వరని నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామస్తులు ఆందోళనకు దిగారు. శనివారం మైలారం గ్రామస్తులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలు పూర్తి కాక ముందే నిర్మాణం చేపడుతున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళలో ప్రవేశించారు. దీంతో రెవెన్యూ అధికారులు మైలారం గ్రామానికి చేరుకుని డబుల్ బెడ్ రూమ్ వద్ద ఆందోళనకు దిగిన గ్రామస్తులను, లబ్ధిదారులను అర్హులైన వారందరికీ త్వరలో నిర్మాణం పూర్తయ్యాక డబుల్ బెడ్ రూమ్‌లను నిర్మించి అప్పగిస్తామని అన్నారు. దీంతో గ్రామస్తులు శాంతించి వెళ్లిపోయారు.

ఏఎన్ఎంపై మెడికల్ ఆఫీసర్‌కు ఫిర్యాదు

రాజంపేట,ఆగస్టు 17:రాజంపేట మండలంలోని ఆర్గోండ గ్రామంలోగల పల్లె దవాఖానలో పనిచేస్తున్న ఏఎన్ఎంపై ఎర్రపహడ్ మెడికల్‌ఆఫీసర్‌కు జంగం శ్రీనివాస్ ఫిర్యాదుచేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14న తన కుమారునికి 15 నెలల టీకా ఇప్పించడానికి గ్రామంలోని పల్లెదవాఖానాలకు వెళ్లామని బాలుడికి హెల్త్ చెకప్‌చేయకుండా 3 టీకాలు ఏఎన్ఎం ఇచ్చారని టీకా ఇచ్చాక ఫీవర్ సీరప్ ఇవ్వకుండా కనీసం అడిగితే లేవని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని అన్నారు. టీకా ఇచ్చిన రోజు రాత్రి ఫీవర్,ఫిట్స్ రావడంతో కామారెడ్డిలోని ప్రైవేట్ ఆసు పత్రికి తీసుకుపోతే రెండురోజులు ఐసీయూలో ఉంచాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఎన్ఎంపై తగిన చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ కోరారు.

ఎల్లారెడ్డిలో మేకల చోరీ

ఎల్లారెడ్డి, ఆగస్టు 17 : ఇంటి ఆవరణలో ఉన్న మేకలు రాత్రి చోరీకి గురైన సంఘటన ఎల్లారెడ్డిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ తండాకు చెందిన కేతావత్ గోపిసింగ్ అనే వ్యక్తి వద్ద 48 మేకలున్నాయి. ప్రతిరోజులాగే మేతకు తీసుకెళ్లి శుక్రవారం సాయంత్రం ఇంటి ముందు గల కొట్టంలో ఉంచగా అర్ధరాత్రి మేకలు అరవడంతో అటు వైపు చూడగా 11 మేకలు కనిపించలేదు. మేకలను దొంగిలించారని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు.

శ్రీవారి ఆలయంలో భక్తుల పూజలు

బీర్కూర్, ఆగస్టు 17 : బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానం శ్రావణ శనివారం సందర్భంగా భక్తుల తాకిడితో కిటకిటలాడింది. వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామి వారిని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు స్వామివారిని దర్శించుకున్నారు. ఇదిలా ఉండగా ఆలయ కమిటీ సభ్యుడు మద్దినేని నాగేశ్వర్‌రావు కుమార్తె తుమ్మల అనిత అమ్మవారి వారి కోసం 90 వేల విలువైన మంగళసూత్రం తాడును తయారు చేయించి, ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ ధర్మకర్త శంభురెడ్డి, ఆలయ సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నరసరాజు, అప్పారావు, రఘు, సత్యనారాయణ పాల్గొన్నారు.

'అక్రమ రిజిస్ట్రేషన్‌పై చర్యతీసుకోండి'



భిక్కనూరులో మాట్లాడుతున్న బాధితులు

భిక్కనూరు, ఆగ ష్టు 17: తమ భూ మిని అడ్డదారిలో రిజిస్ట్రేషన్ చేసు కున్న వ్యక్తితో పాటుగా అందుకు సహకరించిన అధి కారులపై చర్యలు తీసుకోవాలని బాధి తులు మం డలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన బొమ్మల లక్ష్మీ, ఎల్లయ్య, నితిష్ డిమాండ్ చేశారు. శనివారం భిక్కనూ రులో వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ బైండ్ల సుదర్శన్‌కు తాము 10గుంటల భూమిని విక్రయిస్తే తన పలుకుబడిని ఉపయోగించి, తమను మోసగించి ఎకరా10 గుంటల భూమిని రిజి స్ట్రేషన్ చేయించుకున్నాడని, దీంతో పాటుగా తమ భూమిపై తమకు తెలియకుండానే తమ పేరుపై రూ.6.40లక్షల క్రాప్‌లోన్ తీసుకుని వాడుకున్నాడని ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. దీనిపై సుదర్శన్‌ను ప్రశ్నిస్తే తమను చంపేస్తామని బెదిరిస్తున్నారని, ప్రభుత్వం స్పందించి విచారణ చేసి తమను అన్యాయం చేసిన సుదర్శన్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకుని తమ భూమిని తమకు ఇప్పించి తమ పేరుపై తీసుకున్న క్రాప్‌లోన్ డబ్బులను పూర్తిగా బ్యాంకుల్లో కట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాం డ్ చేశారు.

'క్యాంపు ఆఫీస్‌పై దాడి హేయమైన చర్య'

సదాశివనగర్, ఆగస్టు 17 : సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు క్యాంపు ఆఫీస్‌పై దాడి హేయమైన చర్య అని బీఆర్ఎస్ నాయ కులు పడిగెల రాజేశ్వర్ రావు, దశ రథ్‌రెడ్డి, శ్రీనివాస్‌లు అన్నారు. గత పదేళ్లుగా ప్రశాం తంగా ఉన్న రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పట్టుమని పదినెలలు కాకముందే గుండా రాజ్యం తేవాలని చూడడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి రాష్ట్రంలో కూడా అధికారంకోసం హైదరాబాద్‌లో అమాయక ప్రజల ప్రాణాలు తీసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి హరీష్‌రావు రాజీనామా చేయాలని డిమాండ్ చేసే నైతిక హక్కు లేదన్నారు. రాష్ట్రంలో కేవలం 30శాతం మంది కూడా రుణమాఫీ కాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ముందు రుణమాఫీ చేయడానికి ప్రయత్నించాలని తెలిపారు. సమావేశంలో కాలభైరవస్వామి దేవాలయ మాజీ చైర్మన్ సతీష్ గుప్తా,మద్దికుంట మాజీ ఎంపీటీసీ రాజేం దర్, లింబాద్రి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి



పిట్లంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లు

పిట్లం, ఆగస్టు 17 : మండల కేంద్రంలోని బాలాజీ రైస్‌మిల్‌లో పేకాట ఆడుతున్న పక్కాసమాచారంతో జిల్లా ఎస్పీ సింధూశర్మ ఆదేశాలతో ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ పోలీసుల సహకారంతో దాడులు నిర్వహించారు. అధిక మొత్తంలో నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందని పిట్లం ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... బాలాజీ రైస్‌మిల్‌లో పేకాట స్థావరంపై శుక్రవారం రాత్రి సమయంలో కొంత కాలంగా పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించి 2లక్షల 4వేల రుపాయలు, 5 కార్లు, బైక్, 10 సెల్‌ఫోన్లు స్వాధీన పరుచుకొని వారిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. పట్టుబడిన వారిలో మాజీ ప్రజాప్రతినిధులు పిట్లం వ్యాపారులు, రిటైర్ అధికారులున్నట్లు సమాచారం.

బంద్ విజయవంతం

రామారెడ్డి, ఆగస్టు 17 : విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రామారెడ్డి మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో శనివారం బంద్ పాటించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం నుంచి రథాలగైన్ చౌరస్తా, రాంమందిర్ రోడ్డు, మజీద్‌రోడ్డు తది తర ప్రధాన వీధుల్లో తిరుగుతూ నినాదాలు చేశారు. కార్యక్ర మంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఈశ్వర్, నాయకులు ప్రసాద్, మాజీ సర్పంచ్ సంజీవ్, సందీప్, రమేష్‌రెడ్డి, గంగారాం, ప్రసాద్, రమేష్, అంజయ్య పాల్గొన్నారు.

భిక్కనూరు : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అఘాయిత్యాలు, మారణహోమాలకు నిరసనగా హిందు సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో భిక్కనూరులో శనివారం నిర్వహించిన బంద్ విజయవంతమైంది. ఉదయం నుంచే వ్యాపారస్థులు దుకాణాలను ప్రైవేటు పాఠశాలల యజమానులు పాఠశాలలను స్వచ్ఛందంగా మూసివేయగా ప్రభుత్వ పాఠశాలలను హిందూ సంఘాల ఐక్యవేదిక మండల సభ్యులు మూసివేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ప్రతిఒక్కరూ బంగ్లాదేశ్‌లో హిందువుల పై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలను ఖండించాలన్నారు. భిక్కనూరు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల హిందు సంఘాల ఐక్య వేదిక సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

దోమకొండ : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హత్యాకాండలకు నిరసనగా ఆదివారం దోమకొండ బంద్‌కు హిందూ ధర్మ పరిరక్షణ సమితి పిలుపునివ్వడంతో మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యాసంస్థలు, వ్యాపార సముదాయాలు, కార్యాలయాలు స్వచ్ఛందంగా బంద్ చేశారు. కార్యక్రమంలో హిందూ ధర్మపరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.



భిక్కనూరులో ర్యాలీ తీస్తున్న సభ్యులు

వర్ష ప్రభావిత ప్రాంతాలు పరిశీలించిన చైర్‌పర్సన్



రోడ్డుపై నిలిచిన నీటిని తొలగింపచేస్తున్న చైర్‌పర్సన్

కామారెడ్డిటౌన్, ఆగస్టు 17 : కామారెడ్డి మున్సిపల్‌పరిధిలో శుక్రవారం కురిసిన వర్షానికి పలు ఇండ్లలోకి నీరు రాగా నిజాంసాగర్ రోడ్డులో నీరు నిలిచి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియ, కమిషనర్ సుజాతలు ఆయా ప్రాంతాలను పరిశీలించారు. వర్షం వల్ల ఇబ్బం దులు పడ్డ కాలనీవాసులతో మాట్లాడారు. డ్రైనేజీ లో పేరుకుపోయిన మట్టిని తొలగించాలని పలువురు కాలనీవాసులు సూచించగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- డబుల్ ఇస్మార్ట్
దర్శన్	- మిస్టర్ బచ్చన్
ప్రియా 70	- తంగలన్
ప్రియా 35	- సరకాతి కా అటాంక్

బాన్సువాడ

మహేశ్వరి	- మిస్టర్ బచ్చన్
వెంకటేశ్వర	- తుఫాన్ (మార్నింగ్‌షో)
	కమిటీ కుర్రోళ్లు

చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190